క్లుప్తంగా

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: పన్ను బకాయి అంతా ఏకమొత్తంగా చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీకి గడువు మరో మూడు వారాలు మాత్రమే ఉన్నందున సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను బకాయిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్‌లో వార్డ్ సచివాలయం వారీగా పన్ను బకాయిలు, మొండి బకాయిదార్ల వివరాలపై నగర కమిషనర్ సమీక్షించారు. పన్ను బకాయిదారుల వివరాలను మొండి, సాధారణ లిస్టుగా వేరు చేయాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. బకాయిదార్లకు వలంటీర్ల సహకారంతో ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీపై అవగాహన కల్గించాలని తెలిపారు. మొండి బకాయిదార్లకు రెడ్ నోటీసులు జారీకి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెలవు రోజులైన శుక్ర, శని,ఆదివారాల్లోను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్‌లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డ్ సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు పని చేస్తాయన్నారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథాతథంగా ఉంటాయని తెలిపారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆమె ప్రజల్ని కోరారు.

జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల మధ్య రగడ

- మేల్ విద్యార్థులు కొట్టారంటూ ఫిమేల్ విద్యార్థుల ఫిర్యాదు
- విచారణ చేసిన అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో విద్యార్థుల మధ్య రగడ జరిగింది. గురువారం మేల్ నర్సింగ్ విద్యార్థులు తమపై దాడి చేశారంటూ ఫిమేల్ నర్సింగ్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ విద్యార్థుల మధ్య గొడవ జరుగుతోందని జీజీహెచ్ అవుట్ పోస్టు పోలీసులకు సైతం ఫిర్యాదు వెళ్లడంతో పోలీసులు, ఆసుపత్రి అధికారులు నర్సింగ్ స్కూల్ వద్దకు చేరుకున్నారు. ఇటీవల నర్సింగ్ స్కూల్‌లో జరిగిన ఓ వేడుక నిర్వహణకు డబ్బులు వసూలు చేసే విషయంలో విద్యార్థుల మధ్య గొడవకు కారణమైనట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థుల మధ్య విచారణ చేశారు. నర్సింగ్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ డే వేడుకలు ఇక నుంచి చేయడానికి వీల్లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే వారికి సీటు క్యాన్సిల్ చేసేందుకు వెనుకాడబోమని తెలిపారు. విద్యార్థులకు స్టైఫండ్‌ను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

గుంటూరు మెడికల్: సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం గుంటూరు మిర్చి యార్డులో కూలీలు, రైతులకు విజన్ ఆన్ వీల్ సంచార కంటి ఆసుపత్రిలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. కంటి శుక్లాలు ఉన్నవారిని గుర్తించి తమ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేశుని రాజేష్ తెలిపారు. ప్రతినెలా మొదటి మంగళవారం మిర్చి యార్డులో సుదర్శని కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్యం అందిస్తామని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ సతీష్, ప్రశాంత్, సాయి, ఆయూబ్ పాల్గొన్నారు.

76 మందికి స్టాఫ్‌నర్సుల నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి 76 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి. డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు.



జగనన్న పాలనలో పేదల గడప దగ్గరకే సంక్షేమం

నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని పేదల గడపకు చేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 14, 15, 54 డివిజన్ల పరిధిలోని ఆయా సచివాలయాల్లో గురువారం ఆమె ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమానికి శ్రీకారం చుట్టి, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా దేశంలోనే రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని తెలిపారు. నవరత్నాల పేరుతో పెద్దఎత్తున సంక్షేమ పథకాలతో నేరుగా మహిళల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి, తాను అండగా ఉంటాననే భరోసాను కల్పించారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగదు బదిలీ ద్వారా రూ. 2.20లక్షల కోట్లు మహిళల ఖాతాల్లోకి అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతోందని తెలిపారు. ప్రతి పేదవాడిని సంపన్నుడిగా చూడాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. గతంలో ఇళ్ల లేని ఎంతో మంది పేదలకు స్థలాన్ని ఇవ్వడంతో పాటు, నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించడం సంతోషదాయకమని నూరి ఫాతిమా పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అజయ్, ఫర్జానా పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ


పీవీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి రజని, విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి

పట్నంబజారు: బ్రాడీపేట ప్రధాన రహదారిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరత్న పీవీ నరసింహారావు విగ్రహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులంతా సంఘటితంగా పీవీ విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమని ప్రశంసించారు.

దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ

ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ నరసింహారావు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. బ్రాహ్మణ జాతి మాత్రమే కాక యావత్ భారత జాతి గర్వించదగ్గ మేధావిగా ఆయన్ను అభివర్ణించారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ పీవీ నిర్ణయాలు, ఆర్థిక సంస్కరణలే భారతావనికి దిక్సూచిగా మారాయని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు గొప్ప పరిపాలనా దక్షుడే కాక బహుభాషా పండితుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపు శ్రీకాంత్, విగ్రహ దాతలు తుళ్లూరు ప్రకాష్, సురేఖ దంపతులు, పరశురామ బ్రాహ్మణ సంఘం ప్రతినిధి ఆదిలక్ష్మి, బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు బాలకృష్ణ, పొత్తూరి శ్యామ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పోకల వెంకటేశ్వరరావు, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, క్లస్టర్ ట్రెజరర్ మహేంద్ర గులేచా, అన్నంరాజు సాయిరాం, అయితి సతీష్, ఆదిత్య రామకృష్ణ, ఆడిటర్ గణపతి, మన్నేపల్లి హనుమంతరావు, డేవిడ్, నాగార్జున, మాదాసు కిరణ్, సింగు నరసింహారావు, ఆలా కిరణ్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే సీజ్

నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ మధుసూదనరావు


షాపును సీజ్ చేస్తున్న ప్రజారోగ్య అధికారులు

నెహ్రూనగర్: నగరంలో డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసే షాపుల్ని సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని ఎంహెచ్‌ఓ మధుసూదనరావు స్పష్టం చేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం ప్రజారోగ్య అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న షాపులపై దాడులు చేశారు. సంగడిగుంట మెయిన్ రోడ్‌లోని స్పైసీ ఫుడ్స్ అండ్ టిఫిన్స్‌ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఇప్పటికే సచివాలయాల వారీగా షాప్స్, వాణిజ్య సంస్థల డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలు తీసుకుంటున్నామని తెలిపారు. వివరాలు అందిన వెంటనే చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. గతంలో తీసుకున్న లైసెన్స్‌లను కొందరు రెన్యువల్ చేసుకోలేదని, వారు కూడా వెంటనే చేసుకోవాలని ఆయన సూచించారు. సమీప వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత గడువులోగా మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎ.రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు భవానీబాబు, మనోహర్‌బాబు, వెంకటేశ్వరరావు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెప్యూటీ డీఈవో వసూళ్ల వ్యవహారంపై విచారణ

హెచ్‌ఎంలను విచారించిన ఆర్జేడీ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావుపై వచ్చిన అవినీతి, ఆరోపణలపై పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి గురువారం విచారణ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని తన కార్యాలయానికి పిలిపించుకుని గోప్యంగా విచారణ జరిపారు. పాఠశాలల తనిఖీలకు, సందర్శనలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వసూళ్లకు పాల్పడటంతో పాటు వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడిన సంఘటనలపై హెచ్‌ఎంలు, పాఠశాలల యాజమాన్యాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి హెచ్‌ఎంలు చెప్పిన అంశాల వారీగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

కీలక రంగాల్లో రాణిస్తున్న మహిళలు


దివ్యభారతి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు దేశంలోని పలు కీలక రంగాల్లో రాణిస్తున్నారని భారతీ కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఎం. దివ్యభారతి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మహిళా సాధికారిత విభాగ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దివ్యభారతి మాట్లాడుతూ జీవితంలో మనకు తొలి ప్రేరణ ఇచ్చేది తల్లి అయితే, మలి ప్రేరణ ఇచ్చేది గురువులన్నారు. చంద్రయాన్-3 ప్రయోగంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, మహిళా సాధికారిత విభాగ కన్వీనర్ డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.భవాని, ఎస్. విజయలక్ష్మి, కె.లక్ష్మీప్రమీల, డి. ధాత్రికుమారి, దివిజా దేవి, శ్రీవాణి పాల్గొన్నారు.

16న ఏఎల్ బీఈడీ కళాశాలలో వర్క్‌షాప్


బ్రోచర్ విడుదల చేస్తున్న ఎస్తేరు సునీల, ఇన్నారెడ్డి, శేఖర్‌బాబు, కిశోర్‌బాబు, వెస్లీ

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక మాధ్యమాల వ్యసన నియంత్రణ–విద్యార్థుల క్షేమం కోసం కౌన్సెలింగ్ పద్ధతులపై ఈనెల 16న ఏఎల్ బీఈడీ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ఎస్తేరు సునీల పేర్కొన్నారు. లాడ్జి సెంటర్లోని కళాశాలలో గురువారం వర్క్‌షాప్ బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత యువతరానికి సామాజిక మాధ్యమాలు వ్యసనంగా మారి, అనేక మానసిక రుగ్మతలకు గురవతున్నారని తెలిపారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో భాగంగా విద్యార్థుల క్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చర్చించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ పి. అంజన్ కుమార్, డి. శ్రీనివాస్ పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యావేత్తలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హాజరుకావాలని ఆమె కోరారు. వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఇతర వివరాలకు 9490776210, 9441692942, 9959939964 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ డైరెక్టర్లు ఏ.ఇన్నారెడ్డి, వి. శేఖర్ బాబు, జేబీ కిశోర్‌బాబు, ఆఫీస్ మేనేజర్ ఎస్ఏ వెస్లీ, ఎం. వినయ్‌కుమార్, కె. రవి పాల్గొన్నారు.

చంద్రబాబుకు బీసీలపై కపట ప్రేమ


సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు నాని

నెహ్రూనగర్: ఎన్నికలు వస్తున్నాయంటే చాలు..చంద్రబాబుకు బీసీలపై కపట ప్రేమ గుర్తుకు వస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు గూడూరు నాని విమర్శించారు. ఎన్‌జీఓ కాలనీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన డిక్లరేషన్ కేవలం బీసీల్ని వంచన చేయడానికే ప్రవేశపెట్టిందన్నారు. ఎన్నికలు రాగానే బీసీలు గుర్తుకు వచ్చారా.. ఇంతకాలం గుర్తుకు రాలేదా ? అని ప్రశ్నించారు. గతంలో ఎంత చులకనగా మాట్లాడావో గుర్తుపెట్టుకునే ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలను నిలువునా మోసం చేసిన నిన్ను నమ్మే రోజులు పోయాయని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో 11 మందికి మంత్రి పదవులు, తొమ్మిది మందిని మేయర్లుగా నియమించారని గూడూరు నాని గుర్తు చేశారు. కాని చంద్రబాబు బీసీలకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశారని మండిపడ్డారు. 40 సంవత్సరాలుగా కాళ్ల కింద చెప్పుల్లా ఆయన వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని తెలిపారు.

వైద్యులు సేవాభావం కలిగి ఉండాలి


ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులతో డాక్టర్ కామినేని శ్రీనివాస్, సుబ్బారావు, డాక్టర్ వరప్రసాద్

మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్

గుంటూరు మెడికల్: వైద్యులు సేవాభావం కలిగి ఉండి, సమాజానికి సేవలందించాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచించారు. కాటూరి మెడికల్ కళాశాల అండ్ హాస్పిటల్ 2018 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి రోజురోజుకూ మారతోందని, వైద్యులు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసించాలని సూచించారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ చైర్మన్ కాటూరి సుబ్బారావు మాట్లాడుతూ వైద్య విద్య బలోపేతం కోసం తమ సంస్థ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. కాలేజ్ డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించి మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహనరావు మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, దాన్ని ఎంచుకున్న యువ వైద్యులకు అభినందనలు తెలిపారు. విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ వైద్య రంగాన్ని ఎంచుకున్న యువ వైద్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ పూర్ణచంద్రరావు

నెహ్రూనగర్: బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని, రాజ్యాధికారంతోనే అభ్యున్నతి సాధ్యమవుతుందని విశ్రాంత డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పెన్షనర్స్ భవన్ లో గురువారం జరిగిన బీసీ కులాల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికంగా ఉండే బహుజనులకు ఆరు నుంచి ఏడు సీట్లు మాత్రమే కేటాయిస్తున్నారన్నారు. ఏడు శాతం ఉన్నవారికి రాజ్యాధికారం అప్పగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అంగడి సరుకులుగా బహుజనులను వాడుకుంటున్నారే తప్పా వారికి న్యాయం జరగడం లేదని తెలిపారు. బహుజనులకు సబ్ ప్లాన్ నిధులు, కార్పొరేషన్లు వద్దని కేవలం రాజ్యాధికారం మాత్రమే కావాలని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎవ్వరైనా ర్థిలు పోటీలో ఉంటే వారికి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.

నిబంధనలు ఉల్లంఘించే లాడ్జీలపై చర్యలు



పట్నంబజారు: నిబంధనలు ఉల్లంఘించే లాడ్జీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్‌బాషా స్పష్టం చేశారు. కొత్తపేట పీఎస్‌లో స్టేషన్ పరిధిలోని లాడ్జిల యజమానులు, మేనేజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు అనుసరించి రూములు అద్దెకు ఇవ్వాలని తెలిపారు. తప్పనిసరిగా రిజిస్టరు నిర్వహించాలని, లాడ్జికి వచ్చే ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు జిరాక్స్, అడ్రస్ ప్రూఫ్ తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో లాడ్జిలో మద్యం, నగదు, ఇతరత్ర ఏమైనా దొరికితే ఆ లాడ్జిలపై కేసులు నమోదు చేయడంతోపాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లు, వ్యభిచారులు, సంఘ విద్రోహక శక్తులకు ఎటువంటి పరిస్థితుల్లో రూములు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎవరి పైనైనా అనుమానాలు ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ఆ లాడ్జిల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని సత్కరిస్తున్న హిందూ ఫార్మసీ కళాశాల యాజమాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు పోషకాహార విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆమెను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో యూఎస్ఏకు చెందిన ప్రొఫెసర్ కె. వాణి, కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, పి. సీతారామయ్య, ఏ. సీతాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

- మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా గృహ కార్మిక మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఐ సమన్వయకర్త సిస్టర్ వ్యాకుల మేరీ, ప్రిన్సిపాల్ సిస్టర్ ఐడా, అనురాధ, లావణ్య, గృహ కార్మిక మహిళలు పాల్గొన్నారు.

స్వప్నకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రసాయన శాస్త్ర పరిశోధకురాలు జి. స్వప్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. రసాయనశాస్త్ర పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య బి. కేశవరావు పర్యవేక్షణలో 'ఐసోలేషన్, కేరక్టరైజేషన్ ఇన్ సిలికో యాంటీఫెర్టిలిటీ డాకింగ్ స్టడీస్, ఫార్మకోలాజికల్ ఏ వాల్యుయేషన్ ఆఫ్ నేచురల్ అండ్ సింథటిక్ క్రామినో పైరోజోలోన్స్ ఫ్రమ్ కార్డియో డైకోటమా జి ఫ్రాస్ట్- బొరాగినేసి' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె పేర్కొన్నారు.